సాక్షి జయశంకర్ భూపాలపల్లి

గురువారం, 15, మే, 2025



అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి

సరస్వతీనది పుష్కరాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులకు సూచించారు. - 8లో ▸



పసందైన ప్రసాదం..

సరస్వతీనది పుష్కరాలకు వచ్చే భక్తులకు పసందైన లడ్డూ, పులిహోర ప్రసాదం అందించేందుకు అధికారులు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. - 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.0⁰ /26.0⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సాదాబైనామాలే అధికం



రేగొండ: భూభారతి చట్టాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో రేగొండ మండలాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసిన విషయం విదితమే. ఇందులో భాగంగా ఈ నెల 5 నుంచి ప్రారంభమైన రెవెన్యూ సదస్సులు 19వ తేదీ వరకు కొనసాగనున్నాయి. భూసమస్యలు పరిష్కరించడానికి రైతుల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇప్పటి వరకు 11 రెవెన్యూ గ్రామాల్లో 4,083 దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ శ్వేత తెలిపారు. ఇందులో ఎక్కువగా సాదాబైనామాల సమస్యలతోనే రైతులు దరఖాస్తులు చేస్తున్నారని తెలిపారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి



భూపాలపల్లి అర్బన్: లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఏరియాలోని స్థానిక కొమురయ్య భవన్‌లో బుధవారం కార్మిక సంఘాల జేఏసీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నర్సింగరావు, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్, ఐఎన్టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బేతెల్లి మధుకర్ రెడ్డి, టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు బడితెల సమ్మయ్యలు పాల్గొని ఈనెల 20న చేపట్టబోయే దేశవ్యాప్త సమ్మె వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యాత రాజు సతీష్, సీఐటీయూ బ్రాంచ్ కంపేటి రాజయ్య, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కార్మికులు విధులకు హాజరుకావాలి



భూపాలపల్లి అర్బన్: సింగరేణిలో పని చేస్తున్న కార్మికులు ఏడాదికి కనీసం 100 నుంచి 191 రోజుల పాటు విధులకు హాజరుకావాలని 5వ గని మేనేజర్ జాకీర్ హుస్సేన్ సూచించారు. ఏరియాలోని కేటీకే 5వ గనిలో గని మేజర్ జాకీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో గైర్హాజరు కార్మికులకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతంలో ఏడాదికి కనీసం 100 పని దినాలైన విధులకు హాజరు కావాలనే నిబంధన ఉండేదన్నారు. దానిని 191 రోజులకు పెంచారని, వంద మస్టర్ల ప్రామాణికతను మానుకొని విధిగా హాజరయ్యే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రతి ఉద్యోగి ప్రతిరోజూ 8 గంటల పని సమయాన్ని పాటిస్తూ 100 శాతం ఉత్పత్తి సాధించడమే లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. 40 మంది ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులతో కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఆఫీసర్ సందీప్ కుమార్, కార్మిక సంఘాల నాయకులు దోర్నాల తిరుపతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తుల సందడి

మంగపేట: మండల పరిధిలోని శ్రీహేమాచల లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా భక్తులు బుధవారం స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. చింతామణి జలపాతం వద్ద నీటిని తాగి ఆహ్లాదంగా గడిపారు. కొబ్బరికాయలను కొట్టి పూజలు చేశారు. శిఖాంజనేయస్వామిని దర్శించుకున్నారు. దీంతో ఆలయం, షాపుల వద్ద భక్తులతో సందడి వాతావరణం నెలకొంది.

వ్యాపార అభివృద్ధిపై అవగాహన

ములుగు రూరల్: గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలోని గిరిజన సహకార సంఘాల సభ్యులకు వ్యాపార అభివృద్ధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ మేరకు బుధవారం ఐటీడీఏ డైరెక్టర్ జారీసన్ అభివృద్ధి ప్రణాళికపై సభ్యులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సహకార సంఘాల సభ్యులకు ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును సద్వినియోగం చేసుకుని వ్యాపార రంగంలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీఎం డిప్యూటీ డైరెక్టర్ శ్యాంకుమార్, రిటైర్డ్ డీసీఓ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

వేయిస్తంభాల ఆలయంలోని కల్యాణమండపం వద్ద సుందరీమణులతో ఎంపీ కావ్య, ఎమ్మెల్యే నాయిని, మేయర్, కలెక్టర్



రామప్ప ఆలయం చుట్టూ హెరిటేజ్ వాక్ చేస్తున్న మిస్ వరల్డ్ పోటీదారులు







చీరకట్టు.. నుదుటబొట్టు

కాకతీయుల గడ్డపై మెరిసిన ప్రపంచ సుందరీమణులు

- తెలుగింటి ఆడపడుచుల్లా ముస్తాబు
- ఫ్యాన్సీ డ్రెస్‌లు వదిలి అంచుల చీరలు, పట్టుపరికిణీలు కట్టిన భామలు
- హైదరాబాద్ నుంచి నేరుగా హరిత కాకతీయకు..
- వేయిస్తంభాలు, రామప్ప ఆలయంలో సంప్రదాయబద్ధంగా పూజలు
- అందరికీ అభివాదం చేస్తూ ఆకట్టుకున్న ముద్దుగుమ్మలు
- సుందరీమణులకు ప్రత్యేక బహుమతుల అందజేత



కోటలోని శిల్పాలను చూసి అబ్బురపోతున్న సుందరీమణులు

రవిని తలపించే మోము.. తారల వెలుగులు నిండిన కనులు.. నుదుటిపై బొట్టు.. తలనిండా మల్లె, కనకాంబర పూలు, నెలవంక కట్టగా నెమలంచు చీర.. కన్నెపిల్లలు చుట్టగా కలువ రేకుల చీర.. ఆరు మూరల చీర కట్టిన అరిందలు.. ఓరుగల్లులో విహరించారు. ఫ్యాన్సీ దుస్తులు వదిలేసి పదహారణాల తెలుగమ్మాయిల్లా మారి ప్రతి ఒక్కరినీ మంత్రముగ్ధులను చేశారు. రెడ్‌కార్పెట్‌పై హొయలొలుకుతూ చిరునవ్వులతో తమ అందాలను ఆరబోశారు.

సాక్షిప్రతినిధి, వరంగల్/సాక్షి, వరంగల్/హన్మకొండ చౌరస్తా/వెంకటాపురం(ఎం) : మిస్ వరల్డ్ -2025 పోటీదారులు బుధవారం వరంగల్ నగరంలో సందడి చేశారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సుల ద్వారా హనుమకొండకు చేరుకున్న వారు హరిత కాకతీయలో దిగారు. హోటల్ వద్ద వారికి హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద, సీపీ సన్‌ప్రీత్ సింగ్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి, మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ఇతర అధికారులు స్వాగతం పలికారు. హోటల్‌లో సుమారు గంటకుపైగా గడిపిన వారు వేయిస్తంభాల ఆలయానికి వెళ్లే ముందు చీర కట్టుకొని తిలకం దిద్దుకొని అచ్చం తెలుగు అమ్మాయిల్లా తయారయ్యారు. సుందరీమణుల రాకతో చారిత్రక ఆలయ ప్రాంగణం మెరిసిపోయింది. ముందుగా తూర్పు ద్వారం వద్ద గల ఆలయ విశిష్టత, చారిత్రక నేపథ్యాన్ని వివరించే ఏకశిలాశాసనాన్ని టూరిజం గైడ్ సూర్యకిరణ్ క్లుప్తంగా వివరించారు. చారిత్రక ఆలయాన్ని చూసి మురిసిపోయారు.నందీశ్వరుడి ముందు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కుర్చీల్లో పాదాలను శుభ్రం చేసుకున్నారు. నందీశ్వరుడి వద్ద ఫొటోలు దిగిన సుందరీమణులకు కల్యాణమంటపం విశిష్టతను గైడ్ వివరించారు. మంటపం వద్ద మరోసారి ఫొటోషూట్‌తో సందడి చేసి, ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ సుందరీమణులకు సన్నాయి మేళాలు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గర్భగుడిలో రుద్రేశ్వరుడికి అభిషేకం చేసిన అనంతరం పట్టువస్త్రాలు, ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు ఇచ్చారు. అనంతరం ఖిలావరంగల్‌కు బయలుదేరి వెళ్లారు.

కోట చారిత్రక అందాలకు ఫిదా

విశ్వసుందరి పోటీదారులు ఖిలావరంగల్ కోటకు రాత్రి 7.20గంటలకు చేరుకొని కాకతీయ కళా వైభవాన్ని తెలుసుకొని మంత్రముగ్ధులయ్యారు. కోటలో ఏర్పాటు చేసిన ఫ్లియా మార్కెట్‌ను సందర్శించి చేనేత కలంకారి దర్రీస్, జీఐ ట్యాగ్ పొందిన చపాట మిర్చి, పసుపు, హ్యాండ్ బ్యాగులు, బంగారు వర్ణంలో మెరిసిన హ్యాండ్ క్రాఫ్ట్ ప్రత్యేకతల గురించి అధికారులు వివరించడంతో ఆసక్తిగా విన్నారు. కాకతీయుల నాలుగు కీర్తితోరణాల నడుమ నల్ల రాతిలోని శిల్ప కళ సంపదను అందాల భామలు మరింత ఆసక్తిగా తిలకించారు. కాకతీయుల చరిత్ర, విశిష్టతను పర్యాటక శాఖ అధికారులు వివరించారు. టీజీ టీడీసీ ఆధ్వర్యంలో 45 నిమిషాల నిడివిగల సౌండ్ అండ్ లైటింగ్ షోను ఇంగ్లిష్‌లో ప్రదర్శించగా... ఆసక్తిగా వీక్షించారు. అంతకుముందు కాకతీయుల తోరణం ఎదుట గ్రూపు ఫొటో దిగారు. అనంతరం శిల్పాల ప్రాంగణంలో పేరిణి నృత్య కళాకారుడు గంజల రంజిత్ శిష్య బృందం ప్రదర్శించిన శివతాండవం ఆకట్టుకుంది. చివరగా సుందరీమణులకు చేనేత కలంకారి దర్రీస్, చపాట మిర్చి, పాకాల, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ద్వారా రూపొందించిన సావనీర్‌తో కూడిన బహుమతులు అందించారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి కొండా సురేఖ, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రామప్ప అందాలు వీక్షించి..

రామప్ప సరస్సుకట్టపై ఉన్న హరితహోటల్ వద్దకు సాయంత్రం 4:30 గంటలకు చేరుకున్న మిస్‌వరల్డ్ పోటీదారులు సంప్రదాయ దుస్తులు ధరించారు. 5:50గంటలకు రామప్ప ప్రధాన గేట్ వద్దకు చేరుకున్న వారికి కొమ్ముకోయ నృత్యంతో కళాకారులు స్వాగతం పలికారు. కలెక్టర్ దివాకర టీఎస్‌తో పాటు అధికార యంత్రాంగం వారికి పుష్పగుచ్ఛాలు అందించారు. ఆలయానికి చేరుకున్న తరువాత రెండు బృందాలుగా విడిపోయారు. 18 మంది, 15 మంది వేర్వేరుగా రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ విశిష్టతను ప్రొఫెసర్ పాండురంగారావుతో పాటు టూరిజం గైడ్‌లు విజయ్‌కుమార్, వెంకటేష్ వారికి వివరించగా శిల్పకళ సంపదను తమ సెల్‌ఫోన్‌లో బంధించుకున్నారు. ముఖ్య అతిథిగా వచ్చిన మంత్రి ధనసరి సీతక్కతో కలిసి ఆలయ ఆవరణలో గ్రూప్ ఫొటో దిగారు. అనంతరం గార్డెన్‌లో పేరిణి నృత్యం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా ఆసక్తిగా తిలకించారు.

సుందరీమణుల పర్యటన
మరిన్ని ఫొటోలు - 8లో

పండుగలా జరుపుకోవాలి

- రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- వందగదుల గెస్ట్‌హౌస్ ప్రారంభం



గెస్ట్‌హౌస్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

కాళేశ్వరం: సరస్వతీ నది పుష్కరాలను ప్రపంచానికి తెలిసేలా పండుగలా జరుపుకోవాలని రాష్ట ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. బుధవారం రాత్రి సరస్వతీ ఘాట్ తదితర ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం రూ.12 కోట్లతో నిర్మించిన వందగదుల సత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సరస్వతీ ఘాట్ ఆవరణలో కాశిదీక్షిత్ పండితులు, స్థానిక బ్రాహ్మణోత్తముల చేతులమీదుగా హారతి కార్యక్రమాన్ని వైభవంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దఎత్తున వచ్చే అవకాశం ఉందన్నారు. దేవాదాయ శాఖ కమిషనర్ వెంకట్‌రావు పర్యవేక్షణలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్ శర్మ, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, ఈఓ మహేష్ పాల్గొన్నారు.

అర్హత ఉన్నవారికే పదవులు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి: కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికే తగిన గుర్తింపు లభిస్తుందని, అర్హతలు ఉన్న వారికే పదవులు వస్తాయని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అమ్మగార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి అధ్యక్షతన అన్ని గ్రామాల ముఖ్యనేతలతో సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ ప్రక్షాళనలో పీసీసీ పరిశీలకుల బాధ్యత అత్యంత కీలకమైందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. పేదలకు సీఎం సహాయ నిధి అండగా నిలుస్తుందన్నారు. ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, అర్హులైన ప్రతీఒక్కరు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అంతకుముందు వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 38 మందికి సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు రూ.12,60,000 విలువైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, సంస్థాగత ఎన్నికల జిల్లా పరిశీలకులు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి, మాసంపెల్లి లింగాజి, రాష్ట్ర నాయకుడు కటంగూరి రాంనరసింహారెడ్డి, అన్ని గ్రామాల ముఖ్య నేతలు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

పుష్కరాల భక్తులకు అన్నదానం

భూపాలపల్లి రూరల్: కాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు వచ్చే భక్తులకు అన్నదానం కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. బుధవారం భూపాలపల్లి మండలం కమలాపూర్ క్రాస్ జాతీయ రహదారి పక్కన అన్నదానం కోసం ఏర్పాటు చేసిన స్థలాన్ని అధికారులు, స్థానిక నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 15వ తేదీ (గురువారం) నుంచి భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్నదానం నిర్వహించాలని, పార్కింగ్‌తో పాటు ఇతర సౌకర్యాలు కూడా కల్పించాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట కమలాపూర్ మాజీ సర్పంచ్ తోటసంతోష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు దేవన్, యువజన నాయకులు పిప్పాల రాజేందర్, జిల్లా నాయకులు అప్పం కిషన్, తోట రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షాలతో జాగ్రత్త



తూకాన్ని పరిశీలిస్తున్న డీసీఓ

మల్హర్: అకాల వర్షాలతో రైతులు జాగ్రత్తలు పాటించాలని డీసీఓ వాల్యానాయక్ అన్నారు. బుధవారం తాడిచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మండలంలోని కొండంపేట, కొయ్యూరు, వల్లెంకుంట గ్రామాల్లో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా సహకార అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీఓ మాట్లాడుతూ అకాల వర్షాలు వస్తున్నందున జాగ్రత్తలు వహించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు చేసి సంబంధిత రైస్ మిల్లులకు పంపించాలని సెంటర్ నిర్వాహకులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య, అయిత రాజిరెడ్డి, పీఏసీఎస్ సీఈఓ సంతోష్, రైతులు, హమాలీలు పాల్గొన్నారు.

సరస్వతి ఘాట్ వద్ద ఏర్పాటుచేసిన విద్యుత్ వెలుగులు, వేదిక



సరస్వతీనది పుష్కరాలకు వేళాయె..

నేటినుంచి 26వ తేదీ వరకు నిర్వహణ

- సరస్వతిఘాట్‌లో పుణ్యస్నానం ఆచరించనున్న సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు
- లక్షలాదిగా తరలిరానున్న భక్తజనం


జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని గోదావరి, ప్రాణహిత, అంతర్వాహిణి సరస్వతీనది పుష్కరాలు నేటి నుంచి (గురువారం) ప్రారంభం కానున్నాయి. 12 రోజుల పాటు నిర్వహించడానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. గురువారం ఉదయం 5.44 గంటలకు వేదపండితులు ముహూర్తం ఖరారు చేశారు. నదికి విశేష పూజాకార్యక్రమాలతో వేదపండితులు పుష్కరుడిని ఆహ్వానిస్తారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులు సరస్వతి ఘాట్‌లో పుణ్య స్నానం ఆచరించనున్నారు. సీఎంతో పాటు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ముఖ్యులు పాల్గొననున్నారు.

– కాళేశ్వరం

- వివరాలు 8లో ▸

‘మోడల్’లో ఇంటర్ ప్రవేశాలు

- ఈనెల 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- జిల్లాలో 6 ఆదర్శ పాఠశాలలు, 960 సీట్లు



మొగుళ్లపల్లి: ఇంటర్మీడియట్ ఆంగ్లమాధ్యమంలో చదవాలనుకునే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆదర్శ పాఠశాలలు ఓ వరంలా మారాయి. మెరుగైన విద్య, సౌకర్యాలు కల్పిస్తుండటంతో మోడల్ స్కూళ్లకు ఆదరణ పెరిగింది. 2025–26 విద్యాసంవత్సరానికి ఇంటర్మీడియట్‌లో ప్రవేశాల కోసం అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. జిల్లాలో 6 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. ప్రతీ పాఠశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులు ఉన్నాయి. ఒక్కో గ్రూపులో 40 సీట్ల చొప్పున 160 సీట్లు భర్తీ చేస్తారు. జిల్లాలో మొగుళ్లపల్లి, చిట్యాల, గణపురం, కాటారం, మల్హర్, మహముత్తారం మండలాల్లో ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి.


ఎంపిక ప్రక్రియ ఇలా..

పదో తరగతిలో వచ్చిన మార్కులతో పాటు రిజర్వేషన్ ఆధారంగా విద్యార్థుల ప్రవేశాలకు ఎంపిక చేయనున్నారు. అల్పాదాయ వర్గాల వారికి మొదటి ప్రాధాన్యం ఇస్తారు. ఈ నెల 26న దరఖాస్తులను పరిశీలించి ఎంపికైన విద్యార్థుల జాబితాను పాఠశాలల్లో ప్రదర్శిస్తారు. ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు ఎంపికైన విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించి ప్రవేశాలు కల్పించనున్నారు. జూన్ 2వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

బాలికలకు హాస్టల్ సౌకర్యం....

ఆదర్శ పాఠశాలలో చదివే బాలికలకు హాస్టల్ వసతి కూడా ఉంది. 9, 10 తరగతులతో పాటు ఇంటర్మీడియట్ చదువుతున్న 100 మందికే ఈ అవకాశం కల్పించారు.

సద్వినియోగం చేసుకోవాలి



మోడల్ పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి ఫీజు లేకుండా ప్రభుత్వమే ఉచితంగా విద్యనందిస్తుంది. క్రమశిక్షణతో పాటు అనుభవం కలిగిన అధ్యాపకులతో నాణ్యమైన బోధన ఉంటుంది. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– రాకేశ్, ప్రిన్సిపాల్, ఆదర్శ పాఠశాల, కొర్మిశాల

వరంగల్.. బ్యూటీఫుల్..


రామప్పలో సుందరీమణులకు కొమ్ముకోయ నృత్యంతో స్వాగతం


సంప్రదాయ దుస్తుల్లో వేయిస్తంభాల గుడిలోకి వస్తున్న మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు


వేయిస్తంభాల గుడిలోకి వెళ్లే ముందు కాళ్లు శుభ్రం చేసుకుంటున్న కంటెస్టెంట్లు


మిస్ వరల్డ్ కంటెస్టెంట్లతో రాష్ట్ర మంత్రి సురేఖ, వరంగల్ కలెక్టర్ సత్యశారద, మేయర్ సుధారాణి


రామప్పలో మిస్ వరల్డ్ కంటెస్టెంట్లతో రాష్ట్ర మంత్రి సీతక్క, ఎస్పీ శబరీశ్, ఇతర అధికారులు


రామప్ప రామలింగేశ్వరస్వామి వారిని దర్శించుకుంటున్న మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు


వేయిస్తంభాల గుడిలో కంటెస్టెంట్లకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న గంగు ఉపేంద్రశర్మ

సీఎం పర్యటనకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు


సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, సీఎం భద్రతా అధికారి

కాళేశ్వరం : సరస్వతీనది పుష్కరాల్లో పాల్గొనేందుకు గురువారం సీఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వర పర్యటన నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, సీఎం భద్రతా అధికారి వాసుదేవరెడ్డి తెలిపారు. బుధవారం కాళేశ్వరంలోని ఈఓ కార్యాలయంలో సీఎం పర్యటన భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి హెలికాప్టర్ ద్వారా గురువారం సాయంత్రం 5 గంటలకు కాళేశ్వరం చేరుకుంటారని తెలిపారు. సీఎం ప్రయాణించే మార్గంలో పోలీస్ బందోబస్తు, బాంబ్ స్క్వాడ్, ట్రాఫిక్ కంట్రోల్, ఆయా విభాగాల అధికారులు సమన్వయంతో పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, ఆర్‌డీఓ రవి, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా ఎస్‌హెచ్‌జీ హ్యాండ్లూమ్ స్టాళ్లు..


స్టాల్ ఎదుట స్వయం సహాయక సంఘాల సభ్యులు, అధికారులు

కాళేశ్వరం: సరస్వతీనది పుష్కరాల్లో మహిళా స్వయం సహాయ సంఘాల (ఎస్‌హెచ్‌జీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్ ఉత్పత్తుల స్టాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి. ఈ స్టాళ్ల పర్యవేక్షణకు డీఆర్‌డీఓ నరేశ్, పరిశ్రమల శాఖ జీఎం సిద్ధార్థను కలెక్టర్ రాహుల్ శర్మ ప్రత్యేకాధికారులుగా నియమించారు. టెక్స్‌టైల్, హ్యాండ్లూమ్ స్టాళ్లలో పట్టు చీరలు, నూలు వస్త్రాలు, డిజైన్ దుస్తులు, చేనేత వస్త్రాలతోపాటు ప్రత్యేక కలెక్షన్ వస్త్రాలు ప్రదర్శిస్తారని అధికారులు పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులు తక్కువ ధరల్లో, నేరుగా ఉత్పత్తిదారుల నుంచి వినియోగదారులకు అందుబాటులోకి రానున్నాయని, ఈ స్టాళ్ల ఏర్పాటుతో ఎస్‌హెచ్‌జీలు ఆర్థికంగా బలపడే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.

కాళేశ్వరంలోని సరస్వతీఘాట్ వద్ద వీవీఐపీ గ్యాలరీ





సరస్వతీనది పుష్కరాలకు వేళాయె..

నేటి నుంచి 26వ తేదీ వరకు నిర్వహణ

- నేటి ఉదయం 5.44 గంటలకు ముహూర్తం ఖరారు
- ప్రారంభ పూజలో పాల్గొనున్న పీఠాధిపతి మాధవానందాసరస్వతి, మంత్రి శ్రీధర్‌బాబు
- పుష్కర స్నానాలకు సరస్వతీఘాట్, మెయిన్ ఘాట్
- టెంట్‌సిటీ, హారతి స్టేజ్ ఏర్పాటు
- లక్షలాదిగా తరలిరానున్న భక్తజనం


సరస్వతీమాత విగ్రహం వెనుక ఏర్పాటు చేసిన శివుడి ప్రతిమ

కాళేశ్వరం : జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని గోదావరి, ప్రాణహిత, అంతర్వాహిణి సరస్వతీనది పుష్కరాలు నేడు ప్రారంభ కానున్నాయి. గురువారం నుంచి 26వ తేదీ వరకు 12 రోజుల పాటు నిర్వహించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. బుధవారం రాత్రి 10.35 గంటలకు బృహస్పతి మిథునరాశిలోకి ప్రవేశిస్తాడు. కాగా, రాత్రి సమయం సందర్భంగా (నేడు) గురువారం ఉదయం 5.44 గంటలకు వేదపండితులు ముహూర్తం ఖరారు చేశారు. నదికి విశేష పూజాకార్యక్రమాలతో వేదపండితులు పుష్కరుడిని ఆహ్వానిస్తారు. ఈ పూజలో మెదక్ రంగంపేటకు చెందిన పీఠాధిపతి మాధవానందాసరస్వతి పాల్గొననున్నారు. పీఠాధిపతితో మంథని ఎమ్మెల్యే, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, కమిషనర్ వెంకట్‌రావు, కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే, దేవస్థానం అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొననున్నారు. పుష్కరాలకు వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తజనం తరలిరానుందని అధికారులు అంచనా. 12 రోజుల పాటు కాళేశ్వరంలో పుష్కర శోభ నెలకొననుంది. ఉత్తరాఖండ్‌లోని మానస నది, అలహాబాద్‌లోని గంగా, యమున, అంతర్వాహిణి సరస్వతి, తెలంగాణలోని కాళేశ్వరంలో గోదావరి, ప్రాణహిత, అంతర్వాహిణి సరస్వతి నదులకు పుష్కరాలు జరుగుతాయి.

ఏర్పాట్లు ఇలా..

సరస్వతీనది పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.35కోట్లు మంజూరు చేసింది. రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ ప్రత్యేక దృష్టితో పనులు ముమ్మరం చేశారు. అంతర్గత సీసీ రోడ్లు, ప్రసాద శాల కౌంటర్లు, పుష్కరఘాట్ విస్తరణ, రెండు ఘాట్‌ల వద్ద తాత్కాలిక మరుగుదొడ్లు, శాశ్వత మరుగుదొడ్లు, కల్యాణ కట్ట, మెయిన్ ఘాట్ నుంచి సరస్వతీఘాట్‌కు గ్రావెల్‌రోడ్డు, గోదావరిలో మట్టి రోడ్డు, వీఐపీ ఘాట్ నుంచి పలుగుల రోడ్డు మట్టి రోడ్డు, చలువ పందిళ్లు, సరస్వతీమాత విగ్రహం, హారతి స్టేజీపై ఏడు గద్దెలు, జ్ఞానదీపం, తాత్కాలికంగా డెకరేషన్స్, టెంట్‌సిటీ, డార్మెటరీ హౌస్‌లు, ఎగ్జిబిషన్ స్టాళ్లు, జల్లు స్నానాలు, దుస్తులు మార్చుకునే గదులు ఏర్పాటు చేశారు. మిషన్‌భగీరథ ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. కాళేశ్వరం కొత్త బస్టాండ్, వాసవీ సత్రం, అంతర్రాష్ట్ర వంతెన సమీపం, హరితహోటల్ సమీపం, వీఐపీ ఘాట్, ఇబ్బలబోరు వద్ద పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు. పీఠాధిపతుల విడిది కోసం త్రివేణి గెస్ట్‌హౌస్‌లో సాలహారంతో ఏర్పాటు చేశారు. ప్రతీ రోజు కాశీ పండితులతో హారతి కార్యక్రమం నిర్వహిస్తారు. ప్రతీ రోజు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

నేడు కాళేశ్వరానికి సీఎం రాక

సాక్షి ప్రతినిధి వరంగల్/కాళేశ్వరం: కాళేశ్వరానికి రాష్ట్రముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి దంపతులు గురువారం రానున్నారు. ఆయన హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయం నుంచి సాయంత్రం 4గంటలకు బయలుదేరుతారు. 5గంటలకు కాళేశ్వరం చేరుకొని వీఐపీ ఘాటులోని టెంట్ సిటికి వస్తారు. 5.25గంటలకు సరస్వతిమాత విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. 6గంటలకు సరస్వతినదిలో సీఎం దంపతులు సంకల్ప పుష్కర స్నానం చేస్తారు. 6.05గంటలకు శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామిని దర్శించుకుంటారు. 6.30గంటలకు అర్చకులతో ఆశీర్వచనం చేస్తారు. 6.40గంటల నుంచి రాత్రి 7గంటల వరకు సరస్వతి నవరత్నమాల హారతి కార్యక్రమంలో పాల్గొంటారు. రాత్రి 8 గంటల తరువాత రోడ్డు మార్గం గుండా భూపాలపల్లికి చేరుకుంటారని సీఎం కార్యాలయంనుంచి షెడ్యూల్ ఖరారు చేశారు.

పసందైన ప్రసాదం..


ప్రసాదశాలలో లడ్డూ తయారు చేస్తున్న మహిళలు

'కాళేశ్వరం' ప్రసాదం రుచి అమోఘం..

- సరస్వతీనది పుష్కరాల 12 రోజులు భక్తులకు ప్రసాదం
- ఇప్పటికే 60 క్వింటాళ్ల లడ్డూ, 50 క్వింటాళ్ల పులిహోర తయారీ
- ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానం ప్రసాదం భక్తులకు అత్యంత ప్రీతికరం. రుచి, శుభ్రం, నాణ్యతతో తయారు చేస్తుండడంతో భక్తులు ఇష్టంగా తింటారు. ఇక్కడి ప్రసాదాన్ని దేశ, విదేశాలకు కూడా తమ బంధువులకు పంపిస్తుంటారు. లడ్డూ, పులిహోర కోసం కూడా ఆలయాన్ని దర్శించుకునే భక్తులున్నారు. 1996లో రూ.6లక్షల వార్షికాదాయం ఉన్న కాళేశ్వరం దేవస్థానం.. ప్రస్తుతం రూ.6కోట్లకు చేరింది. రవాణా వ్యవస్థ అభివృద్ధి చెందడంతో నిత్యం భక్తులతో కళకళలాడుతోంది. 1982 తర్వాత పదుల సంఖ్యలో ఉన్న భక్తులు.. ప్రస్తుతం శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి వారిని వేల సంఖ్యలో దర్శించుకుంటున్నారు. శని, ఆది, సోమ, మంగళవారాల్లో వేల సంఖ్యలో నిత్యం స్వామివారిని దర్శించుకుంటారు.

లడ్డూ తయారీ..

ఒక లడ్డూ 80 గ్రాములు ఉంటుంది. ఒక బాక్స్‌లో రెండు లడ్డూలు ఉంటాయి. రూ.50కి విక్రయిస్తారు. సింగిల్ లడ్డూ రూ. 20కి విక్రయిస్తారు. ఇందులో తొమ్మిది రకాలు శనగపిండి, చక్కెర, నెయ్యి(తెలంగాణ డెయిరీ), కాజు, కిస్మిస్, యాలకులు, మిస్రీ, పచ్చకర్పూరం, జాజికాయలతో తయారు చేస్తారు.

పులిహోర తయారీ..

పులిహోర ప్యాకెట్ 200గ్రాములు ఉంటుంది. రూ.15కు విక్రయిస్తారు. ఇందులో పన్నెండు రకాలు బియ్యం, నూనె, చింతపండు, పల్లిగింజలు, శనగపప్పు, మినపపప్పు, ఆవాలు, పసుపు, ఎండు మిర్చి, ఉప్పు, మిరియాలు, ఉంగువ కలిపి తయారు చేస్తారు.

ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు..

లడ్డు, పులిహోర విక్రయాలకు ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే లడ్డూ 60 క్వింటాళ్లు, పులిహోర రోజుకు నాలుగు క్వింటాళ్ల చొప్పున సుమారు 50 క్వింటాళ్ల వరకు తయారు చేస్తున్నారు. తయారీలో 60 మంది మహిళలు, 10 మంది పురుషులు నిమగ్నమయ్యారు.

పులిహోర చాలా ఇష్టం



నాకు కాళేశ్వరాలయ పులిహోర చాలా ఇష్టం. రుచిగా ఉంటుంది. లడ్డూ కూడా ఎంతో ఇష్టం. మా బంధువులకు పంపిస్తుంటా.

సురేందర్, మంచిర్యాల

నాణ్యతాప్రమాణాలతో తయారీ



ప్రసాదం నాణ్యతాప్రమాణాలతో తయారు చేయిస్తాం. తెలంగాణ డెయిరీ నెయ్యితో తయారు చేస్తాం. లడ్డూ, పులిహోర నిత్యం భక్తులు అందుబాటులో ఉంటుంది. పుష్కరాలకు భక్తుల రద్దీ మేరకు సరిపడా తయారు చేస్తాం.

శనిగెల మహేశ్, ఈఓ, కాళేశ్వరం దేవస్థానం

అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి

- కలెక్టర్ రాహుల్ శర్మ

కాళేశ్వరం : సరస్వతీనది పుష్కరాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు.


మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ శర్మ

బుధవారం కాళేశ్వరం దేవస్థానంలోని కల్యాణ మండపంలో విధులు కేటాయించిన వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పుష్కరాలకు రోజూ సుమారు లక్షకు పైగా భక్తులు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతీ అధికారి తమకు కేటాయించిన లోకేషన్లలో ముందస్తు పర్యటించి ఏర్పాట్లు పరిశీలించాలని తెలిపారు. 12 సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ పుష్కరాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. ఈ సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఘాట్ల వద్ద 50 మంది గజ ఈతగాళ్లు నాటు పడవలతో పహారా కాస్తున్నట్లు తెలిపారు. తాత్కాలిక బస్టాండ్ నుంచి బస్టాండ్ వరకు భక్తుల సౌకర్యార్థం ఉచితంగా 30 షటిల్ బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. విధులు కేటాయించిన అధికారులు ఎవరైనా గైర్హాజరైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో దేవాదాయ శాఖ డైరెక్టర్ వెంకటరావు, అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్, ఆర్‌డీఓ రవి, తదితరులు పాల్గొన్నారు.

పుష్కరాలకు విస్తృత ఏర్పాట్లు

- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్

కాళేశ్వరం : కాళేశ్వరంలో ఈనెల 15 నుంచి 26వ తేదీ వరకు జరుగనున్న సరస్వతీనది పుష్కరాలకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ తెలిపారు. బుధవారం కాళేశ్వరంలో సరస్వతీ ఘాట్ వద్ద ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేడు (గురువారం) సీఎం రేవంత్ రెడ్డి సరస్వతీమాతా విగ్రహం, ఘాట్ ప్రారంభోత్సవం చేస్తారన్నారు. అనంతరం పుష్కర స్నానమాచరించి కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకున్న తర్వాత త్రివేణి సంగమంలో మొదటిసారి కాశీ పండితులు నిర్వహించనున్న నదీ హారతిలో పాల్గొంటారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో మొదటిసారి పెద్ద ఎత్తున సరస్వతీనది పుష్కరాలు నిర్వహిస్తున్నామని, జిల్లా యంత్రాంగం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో వారికి ఎక్కడా అసౌకర్యం కలగకుండా అధికారులు విధులు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్ శర్మ, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


సరస్వతీఘాట్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న శైలజారామయ్యర్

పుష్కరాల్లో సింగరేణి సేవలు

భూపాలపల్లి అర్బన్: కాళేశ్వరంలో నేటి (గురువారం) నుంచి జరుగనున్న సరస్వతీనది పుష్కరాలకు సింగరేణి సేవలు అందించనున్నట్లు భూపాలపల్లి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.78 లక్షలతో వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. పుష్కరాలకు సింగరేణి గజఈతగాళ్లు, రెస్క్యూ టీం, సెక్యూరిటీ సిబ్బంది మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు భక్తులకు అందిస్తారన్నారు. ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని, పోలీసులకు రక్షణ పరికరాలు అందజేస్తామన్నారు.

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి


యాకమ్మ (ఫైల్)

గార్ల: వడదెబ్బతో ఓ ఉపాధి కూలీ పని ప్రదేశం వద్ద మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని కొత్తపోచారంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గజ్జి యాకమ్మ(60) రోజూ మాదిరిగానే బుధవారం ఉదయం గ్రామ చెరువులో ఉపాధి పనులకు వెళ్లింది. పనులు చేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలింది. వెంటనే సహ కూలీలు యాకమ్మను గార్ల సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందిందని వైద్యసిబ్బంది తెలిపారు.

24 నుంచి 17 రైళ్లకు కేసముద్రంలో తాత్కాలిక హాల్టింగ్

కాజీపేట రూరల్ : కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని కేసముద్రంలో మే 24వ తేదీ నుంచి 17 రైళ్లకు తాత్కాలిక హాల్టింగ్ కల్పించినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ బుధవారం తెలిపారు. కాజీపేట-కొండపల్లి రైల్వే సెక్షన్ల మధ్య జరుగుతున్న మూడో రైల్వే లైన్ నిర్మాణ పనుల కారణంగా చేపట్టిన నాన్ ఇంటర్‌లాకింగ్ వర్క్స్‌తో మహబూబాబాద్‌లో తాత్కాలికంగా హాల్టింగ్ తొలగించి కేసముద్రంలో కల్పించినట్లు సీపీఆర్వో పేర్కొన్నారు.

తాత్కాలిక హాల్టింగ్ రైళ్లు ఇవే..

మే 24 నుంచి 26వ తేదీ వరకు మణుగూరు-సికింద్రాబాద్ (12746) ఎక్స్‌ప్రెస్, మచిలీపట్నం-బీదర్ (12749) ఎక్స్‌ప్రెస్, కాకినాడ పోర్టు-లింగంపల్లి (12737) ఎక్స్‌ప్రెస్, గూడూరు-సికింద్రాబాద్ (12709) ఎక్స్‌ప్రెస్, తిరుపతి-సికింద్రాబాద్ (12763) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-హైదరాబాద్ (12727) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-మహబూబ్‌నగర్ (12861) ఎక్స్‌ప్రెస్, తాంబరం-హైదరాబాద్ (12759) ఎక్స్‌ప్రెస్, ఈ మే 24వ తేదీన తిరుపతి-కరీంనగర్ (12761) ఎక్స్‌ప్రెస్, మే 24 నుంచి 26వ తేదీ వరకు భువనేశ్వర్-ముంబాయి సీఎస్‌టీ (11020) ఎక్స్‌ప్రెస్, మే 26వ తేదీన కాకినాడ పోర్టు-సాయినగర్ షిర్డీ (17206) ఎక్స్‌ప్రెస్, మే 27వ తేదీన బెంగళూరు-లాల్‌ఖాన్ (05073) ఎక్స్‌ప్రెస్, కోయంబత్తూర్-ధన్‌బాద్ (03680) ఎక్స్‌ప్రెస్, మచిలీపట్నం-సాయినగర్ షిర్డీ (17208) ఎక్స్‌ప్రెస్, మే 24 నుంచి 26వ తేదీ వరకు షాలిమార్-హైదరాబాద్ (18045) ఎక్స్‌ప్రెస్, మే 26, 27వ తేదీల్లో నర్సాపూర్-నాగర్‌సోల్ (12787) ఎక్స్‌ప్రెస్, మే 25 నుంచి 27వ తేదీ వరకు చెన్నై సెంట్రల్-అహ్మదాబాద్ (12656) ఎక్స్‌ప్రెస్‌లు.